నేడు తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ జనరల్ బాడీ సమావేశం

కాచిగూడ: తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం ఈ నెల 7వ తేదీన ఉదయం 10గంటలకు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రం (చాకలి ఐలమ్మ హాల్) లో జరుగుతుందని టీయూజేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. టీయూ జేఏసీ అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఉద్యమకారులు హాజరు కావాలని ఆయన కోరారు.

కట్ట మైసమ్మ బోనాలకు వీహెచ్‌కు ఆహ్వానం



వి.హనుమంతరావును ఆహ్వానిస్తునన్న జీహెచ్ఎంసీ ఔట్‌సోర్సింగ్ జేఏసీ ఆకుల శ్రీనివాస్

కాచిగూడ: జీహెచ్ఎంసీ ఔట్‌సోర్సింగ్ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన ఉదయం 10 గంటలకు ట్యాంక్‌బండ్‌లోని కట్టమైసమ్మ దేవాలయం వద్ద బోనాల వేడుకలను నిర్వహిస్తున్నట్లు జేఏసీ కన్వీనర్, టీజేఎస్ కార్మిక విభాగం కన్వీనర్ ఆకుల శ్రీనివాస్ వెల్లడించారు. బోనాల వేడుకలకు హాజరుకావాలని ఆదివారం జేఏసీ నేతలు వి.హనుమంతరావును బాగ్ అంబర్‌పేట లోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ జహీర్, ప్రధానకార్యదర్శి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీసంగీత విభావరి



గాయని శశిరేఖను సన్మానిస్తున్న రమణల సత్యనారాయణ, శివకుమార్

చిక్కడపల్లి: శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్, అమృత గానం సంయుక్త ఆధ్వర్యంలో ఏక గాయని శీర్షికతో ఆదివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కళాభారతి సెంటర్‌లో రాత్రి నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. ప్రముఖ గాయని శశిరేఖ ఎంపిక చేసుకున్న గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రముఖ గాయకుడు రమణ కోరారు. ముఖ్యఅతిథిగా గాయనికి సంగీత రత్న కళా బిరుదును ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, శివకుమార్, టీకే మూర్తి, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి పాటుపడాలి

హిమాయత్‌నగర్ : మహిళల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఏపీ హైకోర్టు రిటైర్డ్ జడ్జి, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ జ్యూడీషియల్ మెంబర్ (రిటైర్డ్) జస్టిస్ టి.రజనీ అన్నారు. న్యాయసేవా పథంలో జస్టిస్ డాక్టర్ గురిజాల రాధారాణి 36 ఏళ్ల కొనసాగి, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జిగా జూన్ 28న పదవీ విరమణ చేసిన సందర్భంగా కుల నిర్మూలన సంఘం (కేఎన్ఎస్), మానవ వికాస వేదిక (ఎంవీవీ), ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ), జనవిజ్ఞాన వేదిక (జేవీవీ), విజ్ఞాన దర్శిని సంయుక్తాధ్వర్యంలో అభినందన సభ కుల నిర్మూలన సంఘం అధ్యక్షుడు ఎండీ వహీద్ అధ్యక్షతన ఆదివారం రాత్రి బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా రాధారాణి, సీఎల్ఎన్ గాంధీ దంపతులను అతిథులు ఘనంగా సన్మానించారు. అడిషనల్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (రిటైర్డ్), సలహాదారులు కేఎన్ఎస్ సీఎల్ఎన్ గాంధీ, కేవీఎస్ గౌరవ అధ్యక్షుడు గుత్తా జ్యోత్స్న, విజ్ఞానదర్శిని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లి ఆదామ్ రాజ్, ఎంవీవీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మా భాస్కర్, జేవీవీ జాతీయ అధ్యక్షుడు నమ్మి స్వరాజ్యలక్ష్మి, భారత్ భూషణ్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చాలి

హిమాయత్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఆదివారం లేఖ విడుదల చేసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టిన 250 గజాల ఇంటి స్థలం, రూ.25 వేల పెన్షన్ సౌకర్యంతో పాటు ప్రతి ఉద్యమకారుడికి గుర్తింపు కార్డు, ప్రభుత్వ పథకాల్లో 20 శాతం వాటా, సంక్షేమ బోర్డు ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డితో స్పష్టమైన ప్రకటన చేయించాలని లేఖలో పేర్కొన్నారు. సమావేశంలో ఫోరం రాష్ట్ర కమిటీ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు సురేందర్ రెడ్డి, దయానంద్, గగన్ కుమార్, జానకీ రెడ్డి, ఇంద్రా కుమార్, రాంబాబు, జగన్ యాదవ్, విష్ణువర్ధన్, శ్యామల, అనంతలక్ష్మి, వీరస్వామి, కిరణ్ కుమార్, వెంకటేశ్వర్లు, భానుప్రకాశ్, గౌస్, సుదర్శన్, భాస్కర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కలుషిత నీరు

అధికారులు పట్టించుకోరు..!

- డాక్టర్ చారిలేన్‌లో కలుషిత నీటి సరఫరా
- జలమండలికి పలుమార్లు స్థానికుల ఫిర్యాదు
- అధికారుల నిర్లక్ష్య ధోరణిపై స్థానికుల్లో ఆగ్రహం

నల్లకుంట: నగర ప్రజలకు ఉచితంగా సురక్షిత తాగునీరు అందిస్తామని జలమండలి అధికారులు ఊదరగొట్టారు. కానీ చాలా ప్రాంతాల్లో కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోంది. జలమండలి అధికారుల మాటలకు, చేతలకు పొంతనే లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా చాలా ప్రాంతాలలో కలుషిత నీరు సరఫరా అవుతోందని స్థానికులు చెబుతున్నారు. ఈ నీటిని తాగిన ప్రజలు రోగాల బారిన పడ్డారని పేర్కొన్నారు. కలుషిత నీటి సరఫరా సమస్యను పలుమార్లు జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారుల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

◆ పాత నల్లకుంట డాక్టర్ చారిలేన్‌లో (ఇంటి నం .2-1-1/1 నుంచి నంబర్ 2-1-1/42 వరకు) గతంలో తాగునీటి సరఫరా పైప్‌లైన్‌లో లీకేజీల కారణంగా కలుషిత నీరు సరఫరా జరిగేది. ఈ సమస్యను స్థానికులు పలుమార్లు జలమండలి డీజీఎం, ఏఈలతో పాటు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఆ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో స్థానికులు సమస్యను 'సాక్షి' దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యపై ఏడాదిన్నర క్రితం 'కలుషిత నీటితో పరేషాన్'పేరిట సాక్షిలో ఓ కథనం ప్రచురితమైంది.

◆ ఆ సమయంలో స్పందించిన నాటి జలమండలి విజ్ఞాపురికాలనీ సెక్షన్ మేనేజర్ డ్రైనేజీ పైపుల్లో లీకేజీలు ఏర్పడ్డాయని గుర్తించారు.నూతన పైపుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.కాగా డ్రైనేజీ పైపుల నిర్మాణ పనులు సగం వరకే పూర్తిచేసి ఆ తర్వాత పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు.

◆ ఆ తర్వాత ఇద్దరు మేనేజర్లు మారడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదంటున్నారు. దీంతో సమస్య మళ్లీ మొదటికే వచ్చి గత రెండు వారాలుగా కుళాయి ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో డ్రైనేజీ పైపుల పునరుద్ధరణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రంగు మారిన తాగు నీరు

కొనుక్కుని తాగాలంటే ఎలా?



రెండు వారాలకు పైగా కలుషిత నీరు సరఫరా అవుతోంది. రంగు మారి దుర్వాసన వచ్చే ఈ నీటిని తాగలేక పోతున్నాం. నిత్యం బహిరంగ మార్కెట్‌లో డబ్బు పెట్టి తాగునీరు కొనుక్కుని తాగాలంటే కష్టమే. ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి కలుషిత నీటి సరఫరా నివారణకు చర్యలు చేపట్టాలి.

– గోపి, డాక్టర్ చారిలేన్ వాసి

పైపులైన్ పనులు పూర్తి చేయాలి



డాక్టర్ చారిలేన్‌లో కొంత కాలంగా కుళాయి ద్వారా కలుషిత తాగునీరు సరఫరా జరుగుతోంది. సాక్షి పత్రికలో కథనం వెలువడడంతో స్పందించిన అధికారులు కొత్త పైపులైన్ పనులు చేపట్టారు. కానీ మధ్యలోనే నిలిపి వేశారు. దీంతో సమస్య మళ్లీ మొదటికే వచ్చింది. వీధి మొత్తం డ్రైనేజీ పైపులైన్ పూర్తి చేసి కలుషిత నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– గంట లక్ష్మణ్, అసోసియేషన్ సభ్యుడు

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



సుందరయ్య పార్కులో వైద్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపి ఆరోగ్యవంతుగా జీవించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. దివారం సుందరయ్య పార్కులో గచ్చిబౌలి రివియా వాస్కులర్ ఇన్‌స్టిట్యూట్ వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ సంయుక్త ఆధ్వర్యంలో మోకాళ్ల నొప్పులు వెరికోసిస్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నేడు అనేక మంది బీపీ, షుగర్‌తో పాటు అధికంగా మోకాళ్ల నొప్పులు, వెన్ను నొప్పి, వెరికోస్ వెయిన్ సమస్యలతో భాదపడుతున్నారని అన్నారు. ఈ సమస్యలకు ఆధునిక వైద్యం అందుబాటులోకి రావడం శుభపరిణామమని అన్నారు. ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్లు డాక్టర్ అర్జున్‌రెడ్డి, డాక్టర్ కార్తీక్ మిక్కినేని మాట్లాడుతూ.. వయస్సుతో సంబంధం లేకుండా మోకాళ్లు, వెన్నునొప్పి సమస్యలు అధికమవుతున్నాయని అన్నారు. మోకాళ్ల నొప్పులకు శాస్త్ర చికిత్స లేకుండా వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పీవీ నిరంజన్‌రెడ్డి ప్రధాన కార్యదర్శి ఎస్.మనోహర్ రెడ్డి, ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం, నాయకులు దామోదర్‌రెడ్డి, ఎస్.రమేష్‌రెడ్డి, ఆర్.వివేక్, శైలజ మోహన్, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హరనాథ మహాప్రభు జయంతి





కుసుమ హరనాథులకు అర్ధ ఏకాహం పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు, భజనలో పాల్గొన్న భక్తులు

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ పురవీధులు కుసుమ హరనాథుల నామస్మరణలతో మార్మోగాయి. స్థానిక శ్రీ కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆదివారం శ్రీ హరనాథ మహాప్రభు 160వ జయంతి వేడుకలు నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం 4.30 గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమం ప్రారంభం కాగా కుసుమ హరనాథులకు అర్ధ ఏకాహం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరనాథ భక్తులచే నిర్వహించిన 'జయ హరనాథ జయ కుసుమ కుమారి జయ'భజన విశేషంగా ఆకట్టుకుంది. సాయంత్రం మంగళహారతితో జయంతి వేడుకలు ముగిసాయి. ఈ వేడుకల్లో శ్రీ కుసుమ హరనాథ ఆశ్రమ పాలక మండలి ప్రతినిధులు గుబ్బా నాగేంద్ర, జీవీ.హరీష్‌గౌడ్, సత్యనారాయణ, కేవీ.రమణారావు, రాములు, సోమలింగం, కృష్ణమూర్తి, హరినాథ్ బాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలను పరిష్కరించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను సన్మానిస్తున్న మాల బస్తీవాసులు

చిక్కడపల్లి: నియోజవర్గంలోని ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని మాలబస్తీలలో ప్రజలకు ఇబ్బందికరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి మరోచోట నూతన సిమెంట్ పోల్ ఏర్పాటు, సమస్యల పరిష్కారానికి సహకరించిన ఎమ్మెల్యేను ఆదివారం బస్తీవాసులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షకాలం దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. అంతర్గత రోడ్ల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులను సమన్వయ పరుస్తూ నియోజకవర్గ అభివృద్ధికి ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, ఎం.రాకేష్‌కుమార్, శ్రీకాంత్,ముఠా నరేష్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, బస్తీ నేతలు జి.సునిల్‌కుమార్, కృష్ణ జగదీష్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి



అశోక్‌నగర్ వీధి.2లో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ పావని, నేతలు



శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ఉమారాణి

చిక్కడపల్లి: 'ఒకే దేశం... ఒకే ఎన్నిక'ఉండాలని ఆనాడే జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ నినదించారని కార్పొరేటర్ పావనివినయ్ కుమార్ అన్నారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని ఆదివారం డివిజన్‌లోని అశోక్‌నగర్ వీధి నంబర్.2లో ఆమె మొక్కలు నాటారు. శ్యామాప్రసాద్ ముఖర్జి ఆశయ సాధనకు పార్టీ శ్రేణులంతా అంకిత భావంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, వనీస్‌కుమార్, వినయ్‌ప్రసాద్, శ్రీకాంత్, వీఎస్టీ రాజు, నర్సింగ్ రావు, శివకుమార్, నర్సింహ, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం

కాచిగూడ: భారతీయ జన్ సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ దేశానికి అందించిన సేవలు మరువలేనివని కార్పొరేటర్ ఉమారాణి అన్నారు. ఆదివారం కాచిగూడ డివిజన్ బీజేపీ నేతలు ఆయన జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బల్బీర్, సుభాష్ పటేల్, శేర్‌సాగర్, వాసు, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, ఆనంద్, ఎస్.రవియాదవ్, రాము, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు

చరిత్రను వక్రీకరించేలా 'హరిహర వీరమల్లు'

పంజగుట్ట: పవన్‌కళ్యాణ్ నటిస్తున్న హరిహర వీరమల్లు సినిమా పూర్తి కల్పితమని, ప్రజా వీరుడు పండగ సాయన్న జీవిత చరిత్రను తీసుకుని చరిత్రలో ఎక్కడాలేని కల్పిత పాత్రలతో ఈ సినిమా తీస్తున్నారని బీసీ సంఘం నాయకుడు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి డాక్టర్ శివ ముదిరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చరిత్రను వక్రీకరించే ఈ సినిమాను అడ్డుకుంటామని, త్వరలో సినిమాపై హైకోర్టులో పిల్ వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పండగ సాయన్న జీవిత చరిత్ర ఆధారంగా సినిమా తీశారని తాము ఆరోపించగా, సినిమా యూనిట్ తప్పును సమర్థించుకునేందుకు పండగ సాయన్న సినిమా కాదని, 1336లో విజయనగర సామ్రాజ్యం స్థాపించిన హరిహర బుక్కరాయలు కథ అని చెబుతున్నారని అన్నారు. సినిమా ట్రైలర్‌లో మాత్రం అందుకు విరుద్ధంగా ఉందన్నారు. డబ్బులకోసం చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని, దీన్ని తప్పకుండా అడ్డుకుంటామని, త్వరలోనే హైకోర్టును ఆశ్రయిస్తామని శివ తెలిపారు.

ప్రతిభ ఉన్నవారిని ప్రోత్సహించడం అభినందనీయం



సాహితీ పురస్కారాలను ప్రదానం చేస్తున్న వంశీ రామరాజు, జె.చెన్నయ్య

చిక్కడపల్లి: ప్రతిభ ఉన్నవారిని గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని వంశీ సంస్థల వ్యవస్థాపకుడు వంశీ రామరాజు అన్నారు. శనివారం రాత్రి జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ పురస్కార స్వీకర్త రావూరి భరద్వాజ స్మారక సాహితీ పురస్కార ప్రదానోత్సవం త్యాగరాయ గానసభలో జరిగింది. ఈ సందర్భంగా బండి నారాయణస్వామికి రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం, కన్నెగంటి అనసూయకు రావూరి కాంతమ్మ స్మారక సాహిత్య సేవా పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు రావూరి వెంకటేశ్వర్‌రావు, జి.వెంకటరెడ్డి, పెద్దూరి వెంకటదాసు, వీవీ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజన్‌కు అనుగుణంగా ఉత్పత్తులు అందించాలి

బంజారాహిల్స్: 2047 విజన్‌కు అనుగుణంగా ఆయా సంస్థలు తమ ఉత్పత్తులను అందించాలని సైయెంట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బీవీఆర్. మోహన్‌రెడ్డి అన్నారు. ఇంజినీరింగ్ తయారీ రంగంలో 60 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న మార్గదర్శక వ్యవస్థాపకుడు వంగూరి మోహన్‌రావు రచించిన 'జ్ఞాపకాల పుస్తకం హౌ ఐ బిల్ట్ ఇట్'ను తాజ్‌కృష్ణాలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీవీఆర్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. తన వ్యవస్థాపక విజయ గాధ ఎంతోమంది పారిశ్రామికవేత్తలు, యువకులకు ఆదర్శంగా ఉంటుందన్నారు. ఈఎల్‌సీవో లిమిటెడ్ చైర్మన్, ఎండీ డాక్టర్ రమేశ్ దాట్ల, గుణేశ్వర పుర్వర్ల, ద్వారకనాథ్ పట్నంతో పాటు పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

వ్యాయామం తప్పనిసరిగా చేయాలి

పంజగుట్ట: ప్రతిఒక్కరూ రోజు 30 నిమిషాలు వారానికి 5 రోజులు తప్పకుండా వాకింగ్ చేయాలని నిమ్స్ ఆసుపత్రి కార్డియోథెరసిక్ వైద్యుడు అమరేశ్వర్ రావు అన్నారు. హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ, ప్రెస్ క్లబ్ హైదరాబాద్ సంయుక్తాధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రన్నింగ్, వెల్‌నెస్, యాక్టివ్ లైఫ్‌స్టైల్‌పై ఆదివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన హాజరై మాట్లాడుతూ.. శరీరం సహకరిస్తే రన్నింగ్, లేకుంటే వాకింగ్ చేయాలన్నారు. జర్నలిస్టులు వారి వృత్తిలో నిత్యం బిజీగా ఉంటారని నిద్ర కూడా తక్కువగా ఉంటుందని, కానీ ఆరోగ్యంగా ఉండాలంటే మంచి నిద్ర ఎంతో అవసరమన్నారు. దీంతో పాటు మంచి ఆహారం కూడా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ హైదరాబాద్ అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు, సీనియర్ పాత్రికేయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



'సామాజిక సేవలో ఐవీఎఫ్ ముందుంటుంది'



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తదితరులు

ముషీరాబాద్: సామాజిక సేవలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) ముందంజలో ఉందని రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఆదివారం ఐవీఎఫ్ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ముషీరాబాద్‌లోని వైశ్య హాస్టల్ ప్రాంగణంలో రక్తదాన శిబిరం, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, ఎవరెస్ట్ శిఖరం అధిరోహించిన విశ్వనాథన్ కార్తికేయకు సన్మానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ దేశంలోని వైశ్యులందరిని ఏకం చేయాలనే సంకల్పంతో ఐవీఎఫ్‌ను ఏర్పాటు చేశామన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి సంవత్సర కాలంలో 2306 యూనిట్ల రక్తాన్ని అందించామన్నారు. ఉన్నత చదువులు చదువుకునే పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ అడ్వైజరీ బోర్డు కమిటీ చైర్మన్ గంజి రాజమౌళిగుప్తా, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్‌గుప్తా, చంద్రశేఖర్, నారాయణ, రవికుమార్, ఉప్పల స్వప్న తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి



ఇందిరానగర్‌లో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



అరుంధతినగర్‌లో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పావని, బీజేపీ నాయకులు

ముషీరాబాద్: అనగారిన వర్గాల అభ్యున్నతికి ఎన్నో పోరాటాలు చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆయన చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఆదివారం బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందిరానగర్‌లోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, సుమన్, నందగిరి నర్సింహ తదితరులు పాల్గొన్నారు. భోలక్‌పూర్ రంగానగర్‌లోని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెన్ శ్రీనివాస్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి నర్సింగ్‌రావు, సుక్క నాగేష్, గోరేభాయ్, రవికుమార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

కాచిగూడ: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం చెప్పల్‌బజార్‌లోని శ్రీపాండురంగ స్వామి రుక్మిణిబాయి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నేత దాత్రిక్ నాగేందర్ బాబ్జీ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ పూజల్లో బీఆర్ఎస్ నేతలు డాక్టర్ శిరీష ఓంప్రకాష్ యాదవ్, రాజేష్, రమేష్, బబ్లుసింగ్, మహేష్ కుమార్, శేషు, అంటో, ఆలయ కమిటీ చైర్మన్ చారి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా స్వామివారి కల్యాణ మహోత్సవం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో తొలి ఏకాదశి పూజలు ఆదివారం నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక వంశీయులు జి. శ్రీనాథ్‌గౌడ్, కీర్తి దంపతులు, జి.సువర్ణలత, కార్యనిర్వహణ అధికారి ఎస్. అన్నపూర్ణ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో సీతారామచంద్రులు, రాధాకృష్ణులు..

నల్లకుంట: ఆషాఢ మాస శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని ఆదివారం న్యూనల్లకుంటలోని శ్రీసీతా రామాంజనేయ సరస్వతి ఆలయం (న్యూరామాలయం)లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చక స్వాములు అప్పారావు, నాగన్నల సీతారామచంద్రులు, రాధాకృష్ణులకు అభిషేకం చేశారు. అనంతరం మూల విరాట్‌ను పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. ఇష్ట దైవాల దర్శనం కోసం పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.





న్యూరామాలయంలో సీతారామచంద్రులు, రాధాకృష్ణులు

శంకరమఠంలో తొలి ఏకాదశి ప్రవచనం



నల్లకుంట: ఆషాఢ మాస శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని ఆదివారం నల్లకుంటలోని శంకరమఠం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా ఉదయం శక్తిగణపతి, చంద్రమౌళీశ్వర స్వామి, శారదా మాతకు విశేష పూజలు కావించారు. అలాగే సాయంత్రం మఠం ఆవరణలో సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. అలాగే తొలి ఏకాదశి ప్రవచన శ్రవణం జరిగింది. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ కావించారు.



చెప్పల్‌బజార్‌లోని పాండురంగ స్వామి దేవాలయంలో పూజలు



చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో జరిగిన పూజల్లో భక్తులు